ప్రజాశక్తి
సోమవారం 15 జులై 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



అన్న క్యాంటీన్ సిద్ధం

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని బండ్లమిట్ట సెంటర్లో ఉన్న అన్నా క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధమవుతోంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత తీసేసింది. అన్న క్యాంటీన్ కోసం నిర్మించిన భవనంలో సచివాలయాన్ని మున్సిపల్ అధికారులు నిర్వహించారు. టిడిపి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటిన్ ప్రారంభించాలని నిర్ణయం చేయడంతో బండమిట్ట సెంటర్లో ఉన్న అన్న క్యాంటీన్ భవనంలో ఉన్న సచివాలయానికి ఖాళీ చేయించి మరమ్మతులు చేయిం చారు. ఈ భవనాన్ని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావును పరి శీలించారు.

కందుకూరులో ప్రారంభానికి సిద్ధమవుతున్న అన్న క్యాంటిన్ ఇదే..

'సోమశిల','కండలేర్ల'ను రక్షిస్తాం..!

- ◆రూ .116 కోట్లు మంజూరు ఇస్తాం ..!
- ◆లస్కర్లకు మూడేళ్ల జీతాలు చెల్లిస్తాం..
- ◆12 గంటలు ముగ్గురు మంత్రులు పర్యటన

సోమశిల ప్రాజెక్టులో దెబ్బతిన్న ఆప్రాన్‌ను పరిశీలిస్తున్న మంత్రులు నిమ్మల, ఆనం, పొంగూరు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లాకు ప్రధాన ప్రాజెక్టులైన సోమశిల, కండలేరు ప్రాజెక్టులను రక్షించే భాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పి. నారాయణతో కలిసి జిల్లాలోని సోమశిల, కండలేరు ప్రాజెక్టులను సందర్శించారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ పర్యటన సాగింది. ఒక ప్రణాళిక లేకపోవడంతో ఆపార్టీ నాయకులు, పోలీసులు, మీడియా ఇబ్బందులు పడ్డారు. నెల్లూరు ఆర్అండ్‌బి అతిథి గృహం నుంచి పోదలకూరు, ఆదూరుపల్లి , కలువాయి. మీదుగా సోమశిల ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు దారిపోడువులా ఆపార్టీ నేతలు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడ నుంచి నేరుగా సోమశిలలోని అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ ఇరిగేషన్ అధికారులతో కొద్దిసేపు సోమశిల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏం చేయాలి, ఎంత ఖర్చు అవుతుందనే విషయాలు తెలుసుకొని ప్రాజెక్టు వద్ద దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి సోమశిల ప్రాజెక్టు అఫ్రాన్ పనులు, ప్రాజెక్టు గేట్లు తదితర అంశాలు పరిశీలించారు. అక్కడ పరిస్థితులు చూసి మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గేట్లు, క్రేన్లు, చిలుముపట్టిపోవడం, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే అంత పరిస్థితులు కనిపించాయి. అక్కడ మీడియాతో మట్లాడిన తరువాత కండలేరు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ఇరిగేషన్ అధికారులతో సుమారు రెండు గంటల పాటు చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను విధ్వంసం చేశారని, ఇప్పట్లో కోలుకోలేని విధంగా తయారు చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టులకు చేసిన దోహం పెద్దదన్నారు. ప్రాజెక్టుల నిర్వాహణకు ఒక్క రూపాయి ఇవ్వలేదని, కనీసం గేట్లుకు గ్రీసుకు కూడా నగదు ఇవ్వకుండా ఐదేళ్ల పనిచేసిన ముఖ్యమంత్రి ఆయనేన్నారు. పోలవరంతోపాటు, ఇతర ప్రాజెక్టులకు రివర్స్ టెండర్ల పేరుతో చేసిందేమి లేదన్నారు. నీటి నిర్వాహణలో కీలకంగా వ్యవహరించే లస్కర్లుకు గత ప్రభుత్వం మూడేళ్ల నుంచి జీతాలు ఇవ్వలేదన్నారు. నెల్లూరు జిల్లాకు ప్రధాన నీటి ప్రాజెక్టులైన సోమశిల, కండలేరు ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. ఆఫ్రాన్ దెబ్బతినడంతో ప్రాజెక్టు ప్రమాదంలో ఉందన్నారు. ఇందుకోసం రూ 80 కోట్లు అవసరం ఉందని అధికారులు చెప్పారని, గేట్లు నిర్వాహణ కోసం మరో రూ 2.5 కోట్లు, కండలేరు కట్టమరమత్తులకు మరో రూ 16 కోట్లు అవసరం ఉందని అధికారులు తమ దృష్టికి తెచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడి వెంటనే నిధులు మంజూరు చేయిస్తామన్నారు. 60 రోజల్లో ఈ పనులకు సంబంధించి పనులు జరుగుతాయని హామీ ఇచ్చారు. సర్వేపల్లి నియోజకవర్గంలో జరిగిన ఇరిగేషన్ పనుల్లో అవినీతికి సంబంధించి ప్రత్యేక దర్యాప్తు చేయించి, చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ రంగానికి తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతి రైతుకు మేలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. అందులో భాగంగానే ఇరిగేషన్ ప్రాజెక్టులను పరిశీలించి అభివద్ధి పనులను మొదలు పెట్టేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. గత ప్రభుత్వం సోమశిల జలాశయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, దీంతో రైతులు చాలా నష్టపోయారని చెప్పారు. వరదలకు దెబ్బతిన్న సోమశిల ఆఫ్రాన్ నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంతో డ్యామ్ మనుగడ ప్రశ్నార్ధకంగా మారిందని చెప్పారు. కనీసం షట్టర్లు, గేట్లు, రోప్స్ వంటి చిన్న చిన్న మరమ్మత్తులు కూడా చేయలేదన్నారు.

సోమశిల, కండలేరు, తెలుగు గంగ ప్రాజెక్టులకు సంబంధించి మొదటి దశలో అత్యంత ప్రాధాన్యత గల పనులను చేపట్టేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి చెప్పారు. ఎమ్మెల్యేలు, అధికారులు సమన్వయంతో రూపొందించిన ఇరిగేషన్ పనులను రెండో దశలో చేపట్టనున్నట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సర్వేపల్లి, కావలి, ఉదయగిరి, కందుకూరు, గూడూరు, సూళ్లూరపేట శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, పాశం సునీల్ కుమార్, నెలవల విజయశ్రీ, జిల్లా కలెక్టర్ ఆనంద్, చీఫ్ ఇంజనీర్ డి రామ్ గోపాల్, సోమశిల, కండలేరు, తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ ఈలు బివి రమణారెడ్డి, ఎంవి రమణారెడ్డి, కష్ణమోహన్, డిఎఫ్ఓ చంద్రశేఖర్, ఆర్డీవో మలోల, తాసిల్దార్ వెంకటస్వామి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఐదేళ్లు నన్నేమి చేయలేరు..!

- ○'బీద'తో 'ఆనం' రగడ
- ○'నిమ్మల' ముందే వివాదం
- ○ఎక్కడ తెల్చాలో అక్కడే తెల్చుతా..

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు ముందే మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సీనియర్ నేత, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రతో వాగ్వివాదానికి దిగినట్లు తెలిసింది. గత కొంత కాలంలో బీద రవిచంద్రపై మంత్రి ఆనం రామా నారాయణరెడ్డి గుర్రుగా ఉన్నారు. బదిలీ విషయంలోనూ, ఇతర విషయాల్లో అధికారులు, నాయకులు రవిచంద్రను కలిసి మాట్లాడడం పట్ల గతంలో అసహనం వ్యక్తం చేసిన ఆయన తాజాగా మరో విషయంలో కూడా ఆనం తన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆదివారం రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ప్రాజెక్టుల పరిశీలనకు నెల్లూరు వచ్చారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో బసచేశారు. మంత్రులు,ఎంఎల్‌లు ఆయనను కలిసి స్వాగతం పలికారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సొంత పనులు ఉన్నప్పటికీ మంత్రిని కలవడానికి అతిథి గృహానికి వచ్చారు. అదే సమయంలో అక్కడ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమో హన్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్ ఉన్నారు. బీద రవిచంద్రను చూడగానే " ఏం సార్ మీ రొక్కరే వచ్చారు. మీ ఫ్రెండ్ రాలేదా ? ఇటీవల ఇద్దరు కలిసి బుకేలు, శాలువాలు తీసుకెళ్తున్నారు." అని ఆత్మకూరు టిడిపి నేత గుటూరు కన్నబాబు గురించి ఆనం రామనారాయణరెడ్డి రవిచంద్రతో అన్నారు. నేనే వచ్చాను. అనడంతో ఆయన ఆత్మకూరులో నాకు వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తిని పక్కన పెట్టుకొని తిరుగుతున్నావ్ ఇది మంచి పద్ధతి కాదు అంటూ ఆనం ఆనడంతో 'మీ కోసం ఆయన పనిచేశారు. ఓట్లును కలిసి ఇచ్చారుగా అని రవిచంద్ర అనడంతో "ఆయన ఇచ్చిన దానితోనే మేం గెలిచాం, ఆయన పనిచేస్తే ఓట్లు ఎక్కడ పడ్డాయి. ఐదేళ్లు నన్ను ఆత్మకూరులో ఎవ్వరూ ఏం చేయలేరు. ఇది ఇలాగే సాగితే ఏం చేయాలోనాకు తెలుసు , ఎక్కడ చెప్పాలో అక్కడే చెబుతా " అంటూ ఆనం ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న అందరూ మౌనంగా కూర్చొండిపోయారు. బీద రవిచంద్ర ఏం మాట్లాడకుండా రామనాయుడుని కలిసి వెళ్లిపోయారు. ఈ సంఘటనతో కొద్ది సేపు అక్కడ వాతవరణ వేడెక్కింది. గత కొంత కాలంలో గుటూరు కన్నబాబు విషయంలోనే మంత్రి ఆనం రామానారాయణరెడ్డి, బీద రవిచంద్రను వ్యతిరేకిస్తూ వస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో అక్కడా, ఇక్కడ మాట్లాడిన ఆయన నేరుగా రవిచంద్రతోనే వాదనకు దిగడంతో ఆపార్టీలో నేతలు అవాక్కయ్యారు. పార్టీకి రాయల్‌గా పనిచేస్తూ పార్టీ కోసమే పనిచేస్తు పదవులు డిమాండ్ చేయకుండా పనిచేస్తున్న వ్యక్తుల పట్ల ఇలా వ్యవహరిస్తారా అంటూ రవిచంద్ర అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

నిమ్మల రామానాయుడు వద్ద వివాదం అనంతరం ఆనం రామనారాయణరెడ్డి, బీద రవిచంద్ర

ఇల్లు కోల్పోయిన ఖాసీం సాహెబ్ కుటుంబం

పెనుగాలులకు ఇల్లు ధ్వంసం..!

సర్వం కోల్పోయిన బాధిత కుటుంబం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం, పెనుగాలు లకు ఓ ఇల్లు ధ్వంసంమైంది. ఫలితంగా ఓ కుటుంబానికి నిలువ నీడ లేకుండా పోయింది. గత రెండు రోజులుగా అర్ధరాత్రి వేళల్లో కురుస్తున్న వర్షం, బలమైన గాలులకు మండలంలోని సౌతాములూరు మిక్స్ కాలనీలో నివసి స్తున్న షేక్. ఖాసీం సాహెబ్ ఇల్లు కూలిపోయింది. ఈ ఘటన లో కుటుంబ సభ్యులు ప్రాణాలతో బ యట పడ్డారు. ఈ ఘటనతో ఖాసీం సాహెబ్ కు టుంభం గూడు వసతి కోల్పోవడ మే కాకుండా రూ. ఒక టిన్నర లక్ష నష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ షా న్వాజ్ ఆదివారం బాధిత కుటుం బాన్ని పరామర్శించారు. పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లా డుతూ గతంలో నిర్మించిన పాత ఇల్లు వర్షానికి , గాలులకు కూలిపోవడంతో ఖా సిం కుటుంబం ఇబ్బందుల్లో పడిందన్నారు. అతని ఆరోగ్యం సరిలేదని, వారిది పేద కుటుంబమని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ఖాసీం సాహె బ్ కుటుంబానికి గహ వసతి కల్పిం చడంతో పాటు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని షాన్వాజ్ డిమాండ్ చే శారు. ఎంఎల్ఎ సోమి రెడ్డి చంద్రమోహన్ స్పందించి సంబంధిత అధికారులను ఆదేశించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

ప్రశ్నించే వారిని హింసించే విధంగా

నూతన క్రిమినల్ చట్టాలు

మాట్లాడుతున్న సుంకర రాజేంద్ర ప్రసాద్

'ఐలు' జాతీయ అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్ విమర్శ

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన వారిని హింసించే విధంగా నూతన క్రిమినల్ చట్టాలు ఉన్నాయని ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు, ఐలు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమలులోకి తీసుకొచ్చిన నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ అవగాహన సదస్సుకు సుంకర రాజేంద్ర ప్రసాద్ ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేవారిని హింసిం చడానికి కొత్త క్రిమినల్ చట్టాలు ఉపయోపడే విధంగా ఉన్నాయని విమ ర్శించారు. జ్యుడిషి యల్ అధికారాలను తగ్గించి పోలీసు శాఖకు అధికారాలు అప్పగించే తరహాలో నూతన క్రిమినల్ చట్టాలు ఉన్నా యన్నారు. వలసవాదుల చట్టాలకంటే క్రూరంగా ఉన్నా యన్నారు. బెయిల్ మార్గద ర్శకాలు , రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరించేలా ఉన్నాయన్నారు. ఆచట్టాల వల్ల న్యాయం మరింత ఆలస్యం అయ్యే అవకాశ ముందన్నారు. యువ న్యాయవాదులు ప్రస్తుతం ఉన్న సాంకేతికతను ఉపయోగిం చుకుని నైపుణ్యం పెంచుకోవాలన్నారు. విలువలు పాటించేలా, సమాజం కోసం మాట్లాడే న్యాయవాదులుగా తయార కావాలని పిలుపు నిచ్చారు. న్యాయస్థానాల్లో అవస రమైన సిబ్బందిని నియమించాలని, కోర్టుల సంఖ్య, న్యాయమూర్తుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సదస్సుకు హాజరైన న్యాయ వాదులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పలు అంశాలపై చర్చించారు. నూతన క్రిమినల్ చట్టాలపై మరింత లోతైన పరిశీలన అవసరం అని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజల హక్కులు కాలరాసేలా ఉన్న అంశాలను తొలగించే వరకు ఉద్యమించాలన్నారు. సదస్సుకు ఐలు జిల్లా అధ్యక్షుడు న్యాయవాది ఎస్ అంకయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా కార్యదర్శి చుక్కా రమేష్ , సీనియర్ న్యాయవాది అబ్బాయి రెడ్డి, ఐలు నాయకులు వై.విజయ్ మోహన్ రెడ్డి,గుంజి దయాకర్, సుబ్ర మణ్యం, జి.బాలసుబ్రమణ్యం, ఎల్ వి.ప్రసాద్, యం. కష్ణుడు, పి ఎన్ ఆర్ ప్రసాద్,చిట్టేటి చంద్రమోహన్, జక్కా.శేషమ్మ, రాఘవ, సుధీర్, కిరణ్, వినేష్ ఉన్నారు.

సదస్సుకు హాజరైన జనం

మొక్కలు నాటుతున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

సేవా కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి-నెల్లూరు : సేవా కార్యక్రమాలు అభినందనీయమనిఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి బత్తల కృష్ణయ్య పేర్కొన్నారు. స్థానిక 25వ డివిజన్ పరిధిలోని బుజ బుజ నెల్లూరు, భగత్‌సింగ్ కాలనీలో ఎస్ఎఫ్ఐ ,డివైఎఫ్ ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి బత్తల కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సేవా కార్యక్ర మాలు చేయడం అభినందనీయన్నారు. ప్రకతి వల్ల కాలుష్యం నివారణకు ప్రజలు యొక్క ఆరోగ్యాలకు సంబంధించి ఉపశమనం చెట్లు వలన ప్రజలు ఆరోగ్యానికి మేలు జరుగునని భావిస్తున్నామన్నారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష ,కార్యదర్శులు ఎస్‌కె .ఫిరోజ్, జి. సుబ్రహ్మణ్యం, డివైఎఫ్ఐ అధ్యక్ష ,కార్యదర్శులు టి. శ్రీనివాసులు. యు. శ్రీని వాసులు, విజయ్‌కుమార్, క్రాంతి కుమార్ ఎస్.కె సమీర్, జీవన్, భాను ప్రకాష్ డివైఎఫ్ఐ మాజీ నాయకులు కొండా ప్రసాద్, 25 డివిజన్ శాఖ కార్యదర్శి కష్ణమూర్తి, కె రవి, అచ్చి తిరుపాల్, పిఎన్ఎమ్ సోమవారపు వెంకయ్య పాల్గొన్నారు.

కందుకూరు ఏరియాలో వర్షం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ప్రాంతంలో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం చిరుజల్లులు పడగా ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమైన వర్షం ఆదివారం రాత్రి భారీ వర్షంగా మారి కురుస్తుంది. వర్షం వల్ల వాతావరణం చల్లబడినప్పటికీ ప్రజలకు ఇబ్బంది కలిగింది. వర్షం భారీగా పడితే వ్యవసాయ పనులు సాగే అవకాశముంది.

ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మరమ్మతులు చేపట్టాలి

సిపిఎం నగర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు : :వెంకటేశ్వరపురం ప్రాంతంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి మరమ్మతులు నాణ్యతా ప్రమా ణాలకు లోబడి యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో వెంకటేశ్వరపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జి దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించారు. సిపిఎం నగర కమిటీ కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి దెబ్బతిందన్నారు. ఆ సమయంలో చేపట్టిన మరమ్మతులు నాశిరకంగా జరిగాయన్నారు. 53వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గుంతలు ఏర్పడిన ప్రతి సారీ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా మరమ్మత్తు పనులు నిర్వహించాలని కార్పొరేషన్, కలెక్టర్‌కు,ఆర్అండ్‌బి అధికారులను సిపిఎం పలు దపాలు కలిసి విజ్ఞప్తి చేసిందన్నారు. ఆందోళన కార్యక్రమాలు సైతం నిర్వహించామని గుర్తు చేశారు. చెన్నయ్,హైదరాబాదు రైల్వే మార్గంపై నిర్మించిన ఫ్లై ఓవర్ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఈ బ్రిడ్జి ఇప్పటికే పలుమార్లు మరమ్మతులకు గురైందన్నారు. ఈ బ్రిడ్జిమీద వాహనాలు అతి వేగంగా ప్రయాణం చేయడం కారణంగా గతంలో భారీ వాహనం బ్రిడ్జిని ఢీకొని ఘటన నెలకొన్నదన్నారు. ఈ బ్రిడ్జికి రక్షణ గోడలు నాశిరకంగా నిర్మించారన్నారు. ఈ బ్రిడ్జి మీద నుంచి రోజుకు వందలాది వాహనాలు ప్రయాణం చేస్తుంటాయని, చెన్నయ్, కలకత్తా, ముంబాయి వంటి ప్రధాన నగరాలకు ఈ మార్గం నుంచే ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలన్నారు. సిపిఎం స్థానిక శాఖ సభ్యులు మూలం ప్రసాద్ మాట్లాడుతూ రైల్వే అధికారులు, ఆర్అండ్‌బి అధికారులు సమస్యపై స్పందించి బ్రిడ్జి మరమ్మత్తు పనులు నాణ్యాతా ప్రమాణాలకు అనుగుణంగా చేయాలని డిమాండ్ చేశారు.

బ్రిడ్జిపై దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

వాహన రాకపోకలు నిషేధం

నగరం నుంచి బుచ్చి, సంగం, ఆత్మకూరు, కడప, కర్నూలు రూట్ వెళ్లే మార్గంలో వేంకటేశ్వర పురం పాలిటెక్నిక్ కాలేజీ వద్ద వున్న రైల్వే బ్రిడ్జి మరమ్మత్తులకు గురి కావడం కారణం చేసి వాహన ప్రయాణం నిషేధించారు. వాహనాలను ప్రధానంగా రెండు మార్గాల్లో ప్రయాణించే విధంగా అధికారులు నిర్ణయం తీసుకోని దారి మళ్లించాచరు. ఇరుకుల పరమేశ్వరి దేవస్థానం ముందు మార్గంలో (వయా జొన్నవాడ) , బుచ్చి రూట్లో, పాత పెన్నా బ్రిడ్జి నుండి నేరుగా ఇనమడుగు సెంటర్ మీదుగా, ఎన్‌హెచ్16 (పాత ఎన్‌హెచ్ 5) సర్వీస్ రోడ్డు, కోవూరు సాయిబాబా గుడి మీద కోవూరు టౌన్ రోడ్డు , సాలిచింతల మీద బుచ్చి రూట్లో ఆత్మకూరు, కడప, కర్నూల్ చేరుకోనే విధంగా చర్యలు తీసుకున్నారు.

'రాళ్లపాడు'కు

1.5 టిఎంసిల నీరు విడుదల చేయండి..!

మంత్రి 'నిమ్మల'కు 'ఇంటూరి' వినతి

ప్రజాశక్తి-కందుకూరు

నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలంలోని సోమశిల జలాశయాన్ని రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లాలోని శాసనసభ్యులు, కలెక్టర్ ఓ.ఆనంద్ ఇతర అధికారులతో కలిసి ఆదివారం ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు సందర్శించారు. నియోజకవర్గంలోని పలు సాగునీటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సోమశిల ప్రాజెక్టు నుంచి రాళ్లపాడు రిజర్వాయర్‌కు ప్రతి సంవత్సరం 1.5 టిఎంసిల నీరు అందించాలన్న నిబంధనలు ఉన్నాయని, గత వైసిపి ప్రభుత్వంలో నీరు విడుదల జరగలేదని తెలిపారు. నిబంధనల ప్రకారం నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. సోమశిల నుంచి రాళ్లపాడు కు నీరు సరఫరా అయ్యే ఉత్తర కాలువలో జంగిల్ క్లియరెన్స్ చేసి, కాలువలో పూడికలు తీసి పటిష్టపరచాలని కోరారు. రాళ్లపాడు ఎడమ కాలువ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత వైసిపి ప్రభుత్వం 27 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించినా.. ఒక్క పైసా కూడా విడుదల కాలేదన్నారు. నియోజకవర్గంలోని మైనర్ ఇరిగేషన్ చెరువుల లో పూడికలు, పంట కాలువల్లో పూడికలు, చెట్లు తొలగింపునకు చర్యలు తీసుకుని కాలువల్లో నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని కోరారు స్పందించిన మంత్రి త్వరలో అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కషి చేస్తారని ఎంఎల్ఎ నాగేశ్వరరావుకు హామీనిచ్చారు.

మంత్రి నిమ్మల రామానాయుడును సన్మానిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

హత్యాచారాలను ప్రతిఒక్కరూ ఖండించాలి

ప్రజాశక్తి-కావలి

ముచ్చుమర్రి మైనర్ బాలిక అత్యాచారం, హత్య కేసు ఒక కొలిక్కి రాకపోగా, ఈ లోపే శనివారం రాత్రి విజయనగరంలో 6 నెలలపాపపై అత్యాచారం జరిగిందని, ఈ రెండు పసికందుల అత్యాచారాల కేసులను ప్రతిఒక్కరూ ఖండించాలని మహిళా సామాజిక కార్యకర్త, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చేవూరికొండ శారద పిలుపునిచ్చారు. ఇంత జరుగుతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎం, హోమ్ మినిస్టర్ నోరు విప్పడం లేదని ఆమె విమర్శించారు. జరిగిన దారుణాలను రాష్ట్రప్రభుత్వం తీవ్రంగా తీసుకుని రేప్ – హత్య బాధితులకు తక్షణం కలవాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. పోక్సో, నిర్భయ చట్టాల ప్రకారమేగాక బహిరంగంగా కఠిన శిక్షలు వేసే అన్ని వయసుల మగవారికి హెచ్చరిక చేయాలన్నారు. పాఠశాల విద్యలో నైతిక, జీవిత విలువలను ముఖ్యాంగా చేయాలన్నారు. చట్టాలు, నేరాలు, శిక్షల గురించి అవగాహన కలిగించే చదువులను ప్రవేశపెట్టాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కౌమారదశ పిల్లల పెంపకంలో మెళకువలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే ముచ్చుమర్రి బాధితులను పరామర్శించి, అధికారులకు తక్షణ ఆదేశాలిచ్చి బాలిక ఆచూకీ తెప్పించి, బాధితులకు అధిక నష్టపరిహారం ఇవ్వాలని శారద డిమాండ్ చేశారు.

18నుంచి జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-ఉదయగిరి / సీతారామపురం : 18వ తేదీ నుండి జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉదయగిరి నియోజకవర్గంలో చేపడుతామని జనసేన జిల్లా కార్యదర్శి ఆలూరి రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం ఆయన సీతారామపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనసేన పార్టీ నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం 18 నుండి 28 వరకు 10 రోజుల పాటు నిర్వహించనున్నట్లు జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ నిర్ణయించారని తెలిపారు. మూడు నెలల క్రితమే క్రియాశీలక పార్టీ సభ్యుల సభ్యత్వం గడువు ముగిసినప్పటికీ ఎన్నికల సమయం కావడంతో పార్టీ శ్రేణులకు గందరగోళం కలిగించకూడదని మూడు నెలలపాటు పెంచిన నేపథ్యంలో రుసుము పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ తన సొంత నిధులతో చెల్లించారని తెలిపారు. క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ.5లక్షల జీవితబీమా, రూ.50,000 ప్రమాదబీమా లభిస్తుందని ఆయన తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గం పరిధిలోని జనసేన పార్టీ కార్యకర్తలు, జనసేన పార్టీ మద్దతుదారులు, పవన్ కళ్యాణ్ అభిమానులు అందరూ కూడా క్రియాశీలక సభ్యత్వం తీసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

కలిగిరమ్మ తిరునాళ్లు ప్రారంభం

ప్రజాశక్తి-కలిగిరి : భక్తుల కొంగుబంగారమై కలిగిరిలో వెలసి ఉన్న కలిగిరమ్మ తిరునాళ్లు ఆదివారం ఆలయం ముందు భక్తులు సుడిమాను నిలుపుదల చేయడంతో తిరునాళ్లు ప్రారంభమయ్యాయి. సోమవారం అమ్మవారి పుట్టినిల్లు అయిన పావన మునిలోకంలో అమ్మవారి ఊరేగింపు సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. మెట్టినిల్లు అయినా జిర్రావారిపాలెంలో రెండవ రోజు మంగళవారం అమ్మవారి ఊరేగింపు ఉంటుంది. బుధవారం కలిగిరిలో అన్నదాన కార్యక్రమం అట్టహాసంగా ఊరేగింపు ఉంటుంది. గురువారం ఆలయం ముందు భక్తులు పాల పొంగళ్లు సమర్పించి గుడి చుట్టూ ఎద్దులబండ్లు, వాహనాలు తిరుగుతాయి. అనంతరం సుడిమాను తీస్తుండంతో తిరునాళ్లు ముగుస్తాయి. నాలుగు రోజులపాటు కలిగిరి పరిసర ప్రాంతాలలో కోలాటం, భజన కార్యక్రమం రకరకాల సాంస్కృతి కార్యక్రమాలు కోలాహలంగా ఉంటుంది.

'మొహర్రం'కు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి-సీతారామపురం : మొహర్రం పండుగ సందర్భంగా సీతారామపురంలోని కోటవీధి వద్ద ఉన్న పీర్లచావిడి పరిసర ప్రాంతాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెంచామని ఎస్ఐ పత్తిపాటి అనూష పేర్కొన్నారు. ఆదివారం సీతారామపురంలో పీర్ల పండుగ నిర్వాహకులతో మాట్లాడి సిసి కెమెరాల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మొహర్రం పండుగ సందర్భంగా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, పీర్ల పండుగ ప్రదేశం 360 డిగ్రీల చుట్టూ సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, సోదర భావంతో భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకొని పోలీసు సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు.

మాట్లాడుతున్న ఎస్ఐ అనూష

మోటారు రిపేర్ చేయించాలి

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని బసినేనిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పడమటిరెడ్డి గ్రామంలో పంచాయతీ మోటారు కాలిపోయినందున ప్రజలు నీళ్లకు అవస్థలు పడుతున్నామని, పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించి ప్రజలు, పశువుల దాహార్తిని తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. మంచినీళ్ళ మోటారు రిపేరుకు రావడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కావలి : డాక్టర్ జి.వి.కె.మెమోరియల్ నెల్లూరు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వెంగళరావునగర్ విశ్వశాంతి హైస్కూల్ ఆవరణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో నెల్లూరు హాస్పిటల్ డాక్టర్లు మాల్యాద్రి, జనరల్ ఫిజిషియన్ ఎం.ప్రసాద్‌రెడ్డి పాల్గొని, వైద్యపరీక్షలు నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులకు కేవలం రూ.200 తీసుకుని 2 నెలలకు సరిపడా మందులు అందజేశారు. ఈ క్యాంపులో 150మందికి పైగా వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు. వైద్య శిబిరంలో గాలి శ్రీనివాసులు, దేవినేని వెంకట రమణయ్య, టిడిపి వార్డ్ ఇన్‌ఛార్జి గంగినేని వెంకటేశ్వర్లు నాయుడు, తదితరుల సహకారంతో విజయవంతం చేశారు.

3కె రన్ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-బిట్రగుంట : బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 4వ తేదీన బోగోలు అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి కప్పరాళ్లతిప్ప వెళ్లే మార్గంలో రామాపురం ఏకలవ్య విగ్రహం వరకు 3కె రన్ నిర్వహిస్తున్నట్లు బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం 3కె రన్ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమాన్ని వాకర్స్ అసోసియేషన్ క్రీడా మైదానంలో సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సజ్జన్ రాజ్, ఫౌండర్ అధ్యక్షులు కుందుర్తి శ్రీనివాసులు, సత్యనారాయణ, శ్రీనివాసులు, ప్రభాకర్, శ్యామ్‌సుందర్, బత్తుల రవిచంద్ర, ప్రభావతి, సుబ్రమణ్యం, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జీతాలు అమలుపై హర్షం

ప్రజాశక్తి-కావలి : కావలి బి.టి.ఎ. ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మణి సుబ్బు మాట్లాడుతూ రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న రెగ్యులర్ టీచర్లకు 010 పద్దు కిందజీతాలు చెల్లించాలని ప్రభుత్వం ఖజానా శాఖకు ఆదేశాలు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ డిమాండ్‌ను బి.టి.ఎ. చాలాకాలంగా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేస్తుందన్నారు. మోడల్ స్కూళ్లలో జీతాలను 010 హెడ్ కింద చెల్లించడం వల్ల 3,000 పైగా ఉన్న రెగ్యులర్ బోధన సిబ్బందికి మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.లక్ష్మయ్య, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.ఆనందరావు, జిల్లా కార్యదర్శి టి.రవి, మండల నాయకులు చెక్క.రవి, బి.నాగేంద్ర, ఎ.కిషోర్, పి.శివకృష్ణ తదితరులున్నారు.

రైతుబజారు ఎదుట ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-కావలి : గత ఐదేళ్లుగా రైతు బజార్ ఆక్రమణలకు గురైంది. ఒక వ్యక్తి ఘరానాగా ఆక్రమించి అధికార పార్టీలో ఉండి, మార్కెట్‌కు పార్కింగ్ స్థలం లేకుండా చేసాడు. ప్రస్తుతం అధికారం మారింది. కానీ ఘరానా వ్యక్తి మళ్లీ అధికారపార్టీలో చేరాడు. కానీ ఎం.ఎల్.ఎ. కావ్య క్రిష్ణారెడ్డి అన్నీ గమనించారు. అధికారులను ఆదేశించారు. ఇంకేముంది.. సదరు ఘరానా వ్యక్తి ఆక్రమణలను తొలగించేశారు. ఇప్పుడు రైతుబజార్ ఎదుట కావాల్సినంత పార్కింగ్ స్థలం. ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి ఆదేశాలతో రైతు బజారు ప్రక్షాళనకు అధికార యంత్రాంగం ఉపక్రమించింది. 2016లో రైతు బజారుకు ముందు ఉన్న ఆక్రమణలు తొలగించి, అదునీకరించి, నిజమైన రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, కాయగూరల ధరల వివరాలతో డిజిటల్ స్క్రీన్ పెట్టి, అధిక ధరలకు అప్పటి టిడిపి ప్రభుత్వం కళ్లెం వేసింది. ఐదేళ్ల క్రితం మళ్లీ మార్కెట్ ముందు వైపు కొంతమంది కమిషన్ ఏజెంట్లు ఆక్రమించి, కొంతమందికి అద్దెలకు ఇచ్చి, స్వయంగా దుకాణాలు తెరిచారు. క్రమంగా రైతు బజారులో రాజకీయ మార్కెట్ శక్తులు పాగా వేసి, ధరలనూ అదుపు తప్పేలా చేసి లబ్ధి పొంది నట్టు ఆరోపణలున్నాయి. దానిపై ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి దృష్టి సారించారు. ప్రక్షాళన ప్రక్రియకు ఆదేశాలిచ్చారు. అధికారులు ఉపక్రమించి, ఆక్రమణలు ఒకే ఒక్క రోజులో తొలగించారు. సిఎం చంద్రబాబు లక్ష్యం మేరకు రైతుకు వినియోగదారునికి మధ్య దళారులకు లేని రైతుబజారు సాకారం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రాయల చెరువును పట్టించుకోండి సారూ..

ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్

దశాబ్దాల కాలంగా రైతులకు ప్రజలకు పశుపక్షాదులకు జీవనాధారమైన ఆత్మకూరు రాయల చెరువు నేడు పాలకుల ఆదరణ లేక మరమ్మతులకు గురై శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి నెలకొంది. దాంతో చెరువు ఆయకట్టుకు వేలాదిమంది రైతులు లక్షలాదిమంది ప్రజలు ఆశలు నీరుగారాయి. అలనా పాలనా లేక రాయల కాలం నాటి ఆత్మకూరు చెరువు తల్లిదండ్రులు లేని అనాథలా ఆదరణ కోసం ఏ మహానుభావుడైన పట్టించుకోక పోతారా అని ఎదురుచూస్తోంది. చరిత్ర పుటలలోకి వెళితే సేకరించిన సమాచారం మేరకు. 1098 ఎకరాల విస్తీర్ణంలో సహజ సిద్ధమైన బొగ్గేరు నీటితో నిండే విధంగా అప్పట్లో సుమారు 5 శతాబ్దాల క్రితం నిర్మాణం చేశారు. చెరువు మిగులు జలాలు వృథా కాకుండా వెంకట్రావు పల్లె, నర్సాపురం, వాసిలి గ్రామాల పొలాలకు సాగునీరు అందించే విధంగా దూరదృష్టితో ఏర్పాటు చేశారు. ఆత్మకూరు చెరువు అయితే ప్రస్తుతం చెరువులో అప్పట్లో ఏర్పాటు చేసిన తూములు శిథిలావస్థకు చేరాయి. ఒకటవ నెంబరు తూము నిరుపయోగంగా మారింది. 2వ నెంబర్ తూము బాగుంది. అయితే ఈ తూము నుండి వచ్చే పంట కాలువలు పలుచోట్ల ఆక్రమణలకు గురై రైతులకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. 3వ నెంబర్ తూము చెరువు

రాయల చెరువు

దగ్గర మర్రి చెట్టు కింద ఉన్న ప్రధానమైన ఇది సుమారు 2500 ఎకరాలకు ఆయకట్టుగా ఉంది. ఇప్పుడు ఈ తూము పరిస్థితి చేపల పెంపకందారులు ఈ తూము కాలువను పూడ్చి వేసి ఒక పక్కన పెద్ద రంధ్రం చేసి నీళ్లు రైతులకు అందించే దానికి పెట్టారు. ఆ విషయం ఇరిగేషన్ అధికారులు గమనించారా లేదో తెలియదు కానీ ఇది చాలా ఘోరమైన పరిస్థితి. ఎన్ని గడ్డున్నా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని ఆయకట్టు రైతులు ఆందోళన చేస్తున్నారు. ఆ మేరకు ఎపి రైతుసంఘం, కౌలు రైతు సంఘ నాయకులు గంట లక్ష్మీపతి, ఐక్య కృష్ణప్రసాద్‌లు ఆదివారం ఆత్మకూరు చెరువును సందర్శించి పొలాలకు నీరందించే తూములను పరిశీలించి చెరువు లోపల భాగం గమనించారు.

500 సంవత్సరాల క్రితమే అద్భుతమైన టెక్నాలజీతో సుమారు 2600 ఎకరాలకు సాగునీరు అందిస్తూ ఉంది. కాలక్రమంలో చెరువు ఆయకట్టు పరిధి 5500 ఎకరాలకు చేరింది. చెరువును పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధులు పట్టించు

తూములను పరిశీలిస్తున్న రైతుసంఘాల నాయకులు

కోని పాపాన పోలేదని తెలుస్తోంది. జాగ్రత్త వహించాల్సిన ఆత్మకూరు చెరువు పాలకులు కానీ సంఘాలు కానీ వ్యవసాయ అధికారులు కానీ ఇరిగేషన్ అధికారులు కానీ రెవెన్యూ అధికారులు కానీ నిర్లక్ష్యం వహించడం వల్ల ఆత్మకూరు చెరువు ఉనికి కోల్పోతుంది. వ్యవసాయానికి మాత్రమే ఉపయోగించే విధంగా ఉన్న చెరువు చేపలకు ప్రాధాన్యత ఇస్తూ సాగునీటిని నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు కానీ అధికారులు కానీ నియంత్రించకపోవడం ఈ స్థితి కారణమైంది.

నువ్వురుపాడు, అశ్వినీపురం, పాత జంగాలపల్లె గ్రామం దగ్గర ఉన్న 4,5,6 నెంబరు తూములు నుంచి సాగునీరు పొలాలకు అందే పరిస్థితులు లేవు. అటవీ శాఖ వారి ఆధ్వర్యంలో సుమారు 40 సంవత్సరాల క్రితమే నల్ల తుమ్మ చెట్లు పెంపకం జరిగి ఉంది. వందల ఎకరాలలో ఈ చెట్లు పెంచబడి ప్రస్తుతం పూర్తిగా ఎండిపోయి ఏ ప్రయోజనం కొరకైతే ఈ స్కీము అమలుపరిచారో అది వృథా అయిపోయింది. అటవీ శాఖ అధికారులు పరిశీలించి ఈ చెట్ల వల్ల కలిగే కనీస ప్రయోజనాలను కాపాడుకోవాలని రైతు సంఘం తరపున కోరుతున్నారు. రెవెన్యూ ఇరిగేషన్ శాఖ అధికారులు ఆత్మకూరు మిగులు జలాల అలుగు కాలువలను వాటికి కేటాయించిన స్థలాలను తూముల నుంచి పొలాలకు అందించే సాగునీటి కాలువలను పూర్తిస్థాయిలో సర్వే జరిపించి పరిరక్షించాలని వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరుతున్నారు. చెరువు పూర్తిగా బూడిపోయి నాలుగు అడుగులకు చేరిపోయింది. ఈ మధ్యకాలంలో రైతులు నువ్వురుపాడు అశ్వినీపురం రైతులు అధికారుల అనుమతితో మూడు అడుగుల లోతులో సారవంతమైన చెరువు మట్టిని పొలాలకు తోలుకుంటూ ఉన్నారు. కనీసం మూడు అడుగుల వైశాల్యం తీస్తే చెరువు నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుందని భవిష్యత్తులో వ్యవసాయానికి అనుకూలంగా మారే రిజర్వాయర్‌గా మారుతుందని రైతు సంఘం నాయకులు అన్నారు. అధికారులు పరిశీలించి తూముల మరమ్మతులు చేసి పంట కాలువలకు మార్గం సుగమం చేయాలని వారు కోరారు. ఐదేళ్ల కొలువుదీరిన కొత్త ప్రభుత్వం ఈ పరిస్థితులను సమీక్షించే మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి పనులు కొనసాగించడానికి ఎన్ని పరిస్థితులు సమీక్ష జరిపి ఒక క్రమ పద్ధతిలో అభివృద్ధి చేయాలని రైతు సంఘాల నాయకులు కోరారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు

ప్రజాశక్తి-కోవూరు

కొడవలూరు మండలంలోని యల్లాయపాళెం గ్రామంలో మహాలక్ష్మమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆదివారం శ్రీ గంగా భవాని అమ్మవారి ఆశీస్సులతో ఎడ్ల పందేలను నిర్వహించారు. సుమారు ఆరు జిల్లాల నుంచి వచ్చిన వారిలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. శ్రీ గంగమ్మ తల్లి మన్నవరప్పు మౌనిక యూత్ తిరునాళ్ల గ్రామం ప్రథమ బహుమతిగా రూ.20116 నగదును దాతలు గంగాభవాని యూత్ అందజేశారు. ద్వితీయ బహుమతి శ్రీ చాముండేశ్వరి సీఫుడ్స్ గంగపట్నం గ్రామం రూ.15116 నగదును దాతలు శ్రీరామ మందిరం మిత్రబృంద యూత్, తృతీయ బహుమతి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి బోగోలు సుకుమార్ అల్లూరు గ్రామం రూ.10116 నగదును మొదటూరి ఆదిశేషయ్య జ్ఞాపకార్థంగా వారి కుమారులు సుధాకర్, వెంకటకృష్ణ, హరిశ్చంద్ర అందజేశారు. నాల్గో బహుమతి యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి యాదగిరి నరుకూరు గ్రామం రూ.8116 నగదు బహుమతిని పొగతోట యూత్ అందజేశారు. ఐదో బహుమతి పంబాల మోక్షితరెడ్డి గంగపట్నం గ్రామం రూ.6116నగదు బహుమతిని రాపూరు క్రిష్ణయ్య జ్ఞాపకార్థంగా కుమారుడు శ్రమంత్ అందజేశారు. నిర్వాహకులు గంగా భవాని యూత్ ప్రశాంత్, సందీప్, శ్రీకాంత్, సునీల్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాకర్ల సురేష్

ప్రజాశక్తి-ఉదయగిరి

సోమశిల జలాశయాన్ని పరిశీలించేందుకు నెల్లూరుకు విచ్చేసిన ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆదివారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఉదయగిరి నియోజకవర్గం పరిధిలోని పలు అంశాలను మంత్రితో ఎంఎల్ఎ కాకర్ల చర్చించారు. నియోజకవర్గంలో వ్యవసాయానికి అవసరమైన నీటి సౌకర్యాలు, పలు సమస్యలను అత్యవసరంగా చేపట్టవలసిన పనులను మంత్రితో చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్‌పి చైర్మన్ చెంచలబాబు యాదవ్, నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మంత్రికి చెంచలబాబు సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, జెడ్‌పి మాజీ చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ ఘనంగా సన్మానించారు. ఆదివారం నెల్లూరులోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మంత్రి 'నిమ్మల'ను కలిసిన కావ్య క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి

జిల్లాలోని ప్రాజెక్టుల పరిశీలన నిమిత్తం ఆదివారం నెల్లూరుకు విచ్చేసిన మంత్రి నిమ్మల రామానాయుడును కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి (కావ్య క్రిష్ణారెడ్డి) నెల్లూరులోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

భ.ని.కా. సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి-కోవూరు

కోవూరులోని సీతాపోలయ్య ఆఫీస్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు యూనియన్ ఏర్పాటు చేసినట్లు, కార్మికులంతా ఐక్యతగా ఉండాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు అల్లాడి గోపాల్ అన్నారు. కోవూరు మండల నాయకులు హరి మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యంగా ఉంటే ప్రతి సమస్యను పరిష్కరించుకోగలరన్నారు. సంక్షేమ బోర్డులు అనేక రాయితులు కార్మికులకు రావాలని సంక్షేమ బోర్డులో ఉన్న కార్మికుల డబ్బులను గతంలో ఉన్న వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు వాడుకున్నారని, అది ఏ మాత్రం మంచి పద్ధతి కాదని ఇకనైనా కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో కోవూరు సిఐటియు నాయకులు ఎస్.కె నజీర్ ఎస్.కె చాంద్, ఎస్.కె హూమా యున్ భాషా, 15మంది కార్మికుల పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ఆఫ్రాన్ పనులను ప్రారంభించండి

ప్రజాశక్తి-అనంతసాగరం

సోమశిల ప్రాజెక్టులో ఆగిపోయిన ఆప్రాన్ పనులను వెంటనే ప్రారంభించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఆదివారం ఆయన సోమశిల ప్రాజెక్ట్‌ను సందర్శించి సందర్శించారు. ఈ సందర్భంగా ఆప్రాన్, హైలెవెల్ కెనాల్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రాజెక్టులను పట్టించుకో లేదన్నారు. గడిచిన ఐదుయేళ్లలో జగన్మోహన్ రెడ్డి విధ్వంసం సృష్టించారని విమర్శించారు. 2020 – 21లో వరదల తాకిడికి ఆప్రాన్, సోమశిల శివాలయం ధ్వంసమైందని జిల్లా వాసి ఇరిగేషన్ శాఖ మంత్రిగా అనిల్‌కుమార్ యాదవ్ పని చేశారని, నెల్లూరు జిల్లా ఇన్‌ఛార్జిగా పనిచేసిన అంబటి రాంబాబు డ్యామ్ భద్రతపై ఆలోచించకపోవడం దారుణమన్నారు. జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎంఎల్ఎలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాకర్ల సురేష్, కావ్య క్రిష్ణారెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్, ఇంటూరు నాగేశ్వరరావు, నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ఇరిగేషన్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ మంత్రికి ఎంఎల్ఎ వినతి

ప్రజాశక్తి-కోవూరు

సాగునీటి కాలువలకు మరమ్మతులు చేసి రైతాంగాన్ని ఆదుకోవాల్సిందిగా కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడును అభ్యర్థించారు. రెండేళ్లకు ముందు పెన్నానదికి వరదలొచ్చి ఇందుకూరుపేట మండలం పల్లిపాడు ఆశ్రమం వద్ద ధ్వంసమైన కరకట్టలను రిటైనింగ్ వాల్స్ నిర్మాణం ద్వారా పటిష్ట పరచాలని మంత్రిని కోరారు. గంగపట్నం పల్లిపాడు బ్రిడ్జ్, వవ్వేరు వద్ద కనిగిరి రిజర్వాయర్‌కు సంబంధించిన మరమ్మతులు, బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని రెడ్డిపాలెం వద్ద పైడేరు ఎస్కేప్ కెనాల్, వవ్వేరు వద్ద ఈస్ట్రన్ కెనాల్‌కు సంబంధించిన మరమ్మతులకు సంబంధించి సమగ్ర నివేదిక మంత్రికి సమర్పించారు. కోవూరు మండల పరిధిలోని పోతిరెడ్డిపాలెం హైలెవెల్ కెనాల్, పడుగుపాడు సమీపంలోని నక్కల మిట్ట కాలువ లేగుంటపాడు సదరన్ కెనాల్స్ పై దెబ్బతిన్న కల్వర్టులు తదితర రిపేర్లకు సంబంధించి వివరాలను మంత్రి దృష్టికి తెచ్చారు. నియోజకవర్గ పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం, కోవూరు, కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట మండలాల్లోని గత ప్రభుత్వం పట్టించుకోని సాగునీటి కాలువల దుస్థితిని ఇరిగేషన్ అధికారుల ద్వార ఎస్టిమేషన్లు వేయించి మంత్రి నిమ్మల రామానాయుడుకు గణాంకాలతో కూడిన వినతిపత్రం అందించారు. కోవూరు నియోజకవర్గం లో కుదేలై ఉన్న సాగునీటి కాలువలను పునరుద్ధ రించాలంటే రూ.20 కోట్లు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. గత కొన్నేళ్లుగా సాగునీటి కాలువలలో గుర్రపు డెక్క,

మంత్రికి సమస్యలను వివరిస్తున్న ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి

గడ్డి తొలగింపు పూడికతీత లాంటి చేయకపోడంతో నీటి పారుదలకు ఆటంకంగా ఉన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని సాగునీటి కాలువలలో పూడిక తీత, గుర్రపు డెక్క, గడ్డి తొలగింపు పనులకు సంబంధించి రూ.736.86 లక్షలు అవసరమవుతాయన్న ఇరిగేషన్ నిపుణుల నివేదికను మంత్రికి అందించారు. నాలుగేళ్ల నుంచి నత్తనడకన సాగుతున్న మలిదేవి డ్రెయిన్ ఆధునీకరణ పనులు ఇప్పటికి 50శాతం మాత్రమే పూర్తయ్యాయని త్వరతగిన పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. విడవలూరు మండలం ముదివర్తి ఇందుకూరుపేట ముదివర్తి పాలెం మధ్య పెన్నానదిపై నిర్మాణంలో ఉన్న కాజ్‌వే నిర్మాణానికి నిధులు కేటాయించి త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి విన్నపాలను విన్న మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారు. సాగునీటి పరంగా ఉన్న సమస్యలు అన్నింటినీ పరిష్కరిస్తామని తెలియజేశారు.

ఆక్రమణలను తొలగించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట

అత్తలగుంట చెరువు ఆక్రమణలు తొలగించి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని ఆదివారం నాగులవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు, టిడిపి సీనియర్ నాయకుడు యర్రం వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. బోగోలు మండలం సుందరగిరి వారి కండ్రిక పంచాయతీ, భాస్కరగిరి వారి కండ్రిక కుచెందిన అత్తలగుంట చెరువు ఆక్రమణకు గురికావడంతో సాగునీరు సక్రమంగా అందక ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ విషయమై యర్రం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 34.70 ఎకరాల విస్తీర్ణం గల చెరువు దాదాపు 20 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైంది. దాంతో ఆయకట్టు రైతులు సాగునీరు అందక పంట నష్టం పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. తెలుగుదేశం

పరిశీలిస్తున్న గ్రామస్తులు

హయాంలో నీరు చెట్టు కింద దాదాపు రూ.20 లక్షలతో చెరువుకు సంబంధించిన పలు పనులను చేసి ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం చెరువు ఆక్రమణలకు గురికావడంతో పట్టించుకునే నాథుడే కరువయ్యా డన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణ తొలగించి హద్దులను చూపించి ఆయకట్టు రైతులను ఆదుకో వాలని స్థానిక రైతులు కోరుతున్నారని తెలిపారు. ఎర్రం తిరుపాల్ రెడ్డి, రాఘవరెడ్డి, బత్తల తిరుపతిరెడ్డి, వెంకారెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సరుకులు వితరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం తుఫాన్ నగర్లో కేన్సర్ వ్యాధితో బాధ పడుతున్న వెంకట శేషయ్యకు పక్షవాతం కారణంగా బాధపడుతున్న ఆటో డ్రైవర్ షేక్ బాదుల్లాకు సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో దాతలు ఎఎస్ఐ మార్టూరు.పరమేశ్వరి, ఆటో డ్రైవర్ తోట.నరేష్ సహకారంతో బాధితుల ఇంటికెళ్లి నిత్యావసర వస్తువులు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, దాత తోట.నరేష్ వారి పిల్లలు అర్షన్, యక్షితలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితమైన బాధితులకు అండగా నిలిచిన దాతలు ఎఎస్.ఐ., ఎమ్.పరమేశ్వరి, తోట.నరేష్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఏలూరు ఎస్‌పి నియామకంపై హర్షం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని చుంచులూరు ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి వరకు విద్యనభ్యసించిన కొమ్మి ప్రతాప్‌శివకిషోర్ ఏలూరు జిల్లా ఎస్‌పిగా నియమించడంతో ఆ గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి చిన్ననాటి గురువు కలిశెట్టి వెంకట రమణయ్య మాట్లాడుతూ వారి తండ్రి నారాయణ చుంచులూరు గ్రామంలో పది సంవత్సరాలు పైగా ఉపాధ్యాయుడిగా పని చేశాడని, కిషోర్ చిన్ననాటి నుంచి ఎంతో చురుకుగా ఉండేవాడని, ఎప్పటికైనా గొప్పస్థాయికి చేరాలని దృఢ సంకల్పంతో ఉండేవాడని అన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పికి అభినందనలు తెలియజేశారు.

మూడు చక్రాలబండి అందజేత

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని కొత్త అల్లంపాడు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు షేక్ సమీంకు వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ప్రజా వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ చౌదరిమూడు చక్రాల బండిని ఆమెకు అందజేశారు. గతంలో ఆమె వాడుతున్న వాహనం మరమ్మతులకు గురై బయటికి వెళ్లేందుకు వీలుకాని విధంగా పాడైపోవడంతో గ్రామానికి చెందిన మౌలాలి అనే వ్యక్తి ద్వారా ఈమెకు మూడు చక్రాల బండి అవసరమని తెలుసుకున్న డాక్టర్ ప్రణీత్ చౌదరి తమ ట్రస్టు సభ్యులతో కలిసి ఆదివారం నేరుగా వారి ఊరికే వెళ్లి దివ్యంగురాలకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కుమార్, తోడేటి అశోక్, ఆది, వెంకటేశ్వర్లు, సమ్మద్, చోటుతో పాటు కొత్తఅల్లంపాడు గ్రామానికి చెందిన మౌలాలి, పెద్ద కాలేమస్తాన్, రసూల్, అబ్దుల్ గఫార్, మహమ్మద్ గౌస్, నాయబ్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్‌ను అందజేస్తున్న దృశ్యం

జాఫర్ సాహెబ్‌కు సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి

పూర్తిస్థాయిలో యుటిఎఫ్‌లో పనిచేసే ఉద్యోగ విరమణ పొందుతున్న షేక్.జాఫర్ సాహెబ్‌కు యుటిఎఫ్ రాష్ట్ర జిల్లా మండల నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఆదివారం స్థానిక షాదీ మందిర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గండిపాలెం మెయిన్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందిన ఆయనను యుటిఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించి మాట్లాడారు. స్నేహశీలి, ఆత్మీయుడు, విద్యా రంగంలో విశిష్ట సేవలందించి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని చిత్తశుద్ధి, అంకితభావం, క్రమశిక్షణతో పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో 36యేళ్లపాటు విశేష సేవలందించి, ఎంతోమంది విద్యార్థులకు సన్మార్గంలో నడిపించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, సామాజిక చైతన్యానికి తనవంతు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర జిల్లా మండల నాయకులు చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, ఫణి కుమార్, మున్నా, రామకృష్ణ, దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, జిలాని, ఉదయ్, అక్బర్ భాషా, అంజాద్, మిత్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాఫర్‌సాహెబ్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

'ఉపాధి' కల్పనలో వీడని నిర్లక్ష్యం

- చేసిన పనులకు అందని వేతనాలు
- సతమతమవుతున్న కూలీల కుటుంబాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం పనులు పేద, మధ్య తరగతి కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నాయి. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ప్రతి కుటుంబానికి 100 కూలీలు ఉండేలా ఉపాధి పనులు కల్పించేవారు. తద్వారా ప్రతి కుటుంబానికి రూ.25వేలు ఉపాధి వేతనాలు ద్వారా లబ్ధి చేకూరడం వల్ల పోషణ భారం తగ్గేది. అలాగే ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా వ్యవసాయం చేసుకునే అన్నదాతలకు కూడా పంట కాలువలు, పిచ్చి మొక్కలు, చెట్లను తొలగింపు, భూమి చదును వంటివి చేయడం వల్ల ఆర్థికభారం తగ్గి వ్యవసాయానికి ఆసరాగా ఉండేవి. ఇదిలా ఉండగా ఈ ఏడాది మాత్రం నూతన ఉపాధి పనులు మంజూరు కాకపోవడంతో ఉపాధి పనులు లేక

'ఉపాధి' పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఉపాధి కూలీలు కొన్నిచోట్ల పూర్తిగా పనులు లేకపోవడంతో ఉపాధి పనులు లేక కుటుంబ పోషణ కష్టమై పేద, మధ్య తరగతి కుటుంబాలు నానా అవస్థలు పడుతున్నారని, కూలీలు రైతులకు వ్యవసాయానికి ఉపయోగపడే పనులు కల్పించకపోవడంతో ఇటు కూలీలు అటు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది కూలీలకు నామ మాత్రంగా ఉపాధి పనులు కలిపించడంతో ఆ పనులకు వెళ్లిన కూలీలకు నెలలు గడుస్తున్న వేతనాలు అందకా పోవడంతో జీవనం సాగించలేక అల్లాడి పోతున్నారు. తొలుత ఎన్నికల కోడ్ పేరుతో పనులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపారు. ఇదిలా ఉండగా పనులు కల్పించకపోవడంతో కొన్ని ప్రాంతాలలో కూలీలు జిల్లా ఉన్నత అధికారి దృష్టికి సైతం తీసుకెళ్లిట్లు సమాచారం. అయినప్పటికీ పనులు కల్పించడంలో అధికారులు మీనామేషాలు లెక్కిస్తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీలు చేసిన పనులకు వేతనాలు ఎందుకు రాలేదు అని కొన్ని ప్రాంతాలలో అధికారులను నిలదీస్తున్నప్పటికీ వారి నుండి సరైన సమాధానం రాకపోవడంతో తాము ఎవరికీ చెప్పుకోలని పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ప్రత్యేక దృష్టి పెట్టి పనులను కల్పించడంతో పాటు, చేసిన పనులకు వేతనాలు అందేలా చూడాలని ఇటు రైతులు అటు కూలీలు కోరుతున్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-సంగం

మండలంలోని కోలగట్ల గ్రామంలోని రెండు నిరుపేద కుటుంబాలకు ఆత్మకూనే నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి నలిశెట్టి శ్రీధర్ సూచనలతో పార్టీ సీనియర్ నాయకులు జెపి.ప్రసాద్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండలాల నాయకులు జనసేన కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బియ్యం, ఫలసరుకులు మరియు కూరగాయల సరఫరా కొరకు టెండరు

తేది: 14-07-2024

2024-2025 సం॥నకు నెల్లూరులోని డి.కే బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల అనుబంధ స్టూడెంట్స్ మేనేజ్డ్ హాస్టల్‌నకు కావల్సిన బియ్యం, ఫలసరుకులు మరియు కూరగాయలు సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్ కొటేషన్స్ ఆహ్వానించడమైనది. టెండర్ ధరఖాస్తు **రుసుము రూ.500/- కళాశాల ప్రిన్సిపాల్/వార్డెన్** పేరు మీద డి.డి. రూపంలో **(కెనరా బ్యాంక్, దర్గామిట్ట, నెల్లూరునకు)** చెల్లించి టెండర్ ఫారములు డి.కే బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్ నందు తీసుకొనవలెను. టెండర్ ఫారములు పూర్తి చేసి **తే22-07-2024 ది ఉదయం 10.00 గం॥**లలోపల ప్రత్యక్షంగా కానీ, పోస్ట్ ద్వారా కానీ ప్రిన్సిపాల్/వార్డెన్ గారికి పంపవలసినదిగా కోరడమైనది. **తే22-07-2024 ది ఉదయం 10.00 గం॥ల** తరువాత వచ్చిన కొటేషన్స్ స్వీకరించబడవు. సీల్డ్ టెండర్లకు అనుమతించుటకు మరియు ఎట్టికారణము లేకుండా తిరస్కరించుటకు ప్రిన్సిపాల్ / వార్డెన్ గారికి పూర్తి అధికారము కలదు. సీల్డ్ టెండర్లు **తే22-07-2024 ది ఉదయం 11.00 గం॥లకు** తెరవబడును. ఇతర వివరములకు **9063988794** ఫోన్ నెంబరును సంప్రదించవలెను.

Sd/- **Principal / Warden,** D.K.Govt Junior College (G) Nellore.